HICON SERIES

CLASS 5 TELUGU

తెలుగు వెలుగు CLASS 5

LESSON 2







CLICK HERE TO ACTIVATE

LESSON
PART 1

# 2 సర్దార్ వల్లభ్ భాయి పటేల్



భారతీయులు ఉక్కు మనిషిగా పిలుచుకొనే సర్దార్ వల్లభ్ భాయి పటేల్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. భారతీయ గ్రామీణ రైతు ప్రతినిధి, ధీరుడు. భారతదేశపు స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయనది ఒక విశిష్టస్థానం. దేశానికి ఒక సుస్థిర ఆకారం కల్పించిన సాహసవంతుడు పటేల్.

వల్లభ్ భాయి పటేల్ 1875 వ సంవత్సరం అక్టోబర్ 31 వ తేదీన గుజరాత్‌లోని ఖేడా జిల్లాలోని కరమ్‌సాద్‌లో జన్మించారు. ఆయన తండ్రి ఝవేరీభాయి, తల్లి లాద్‌బాయి. ఝవేరీభాయి కొంతకాలం సైనికుడిగా పనిచేసాడు. తర్వాత స్వగ్రామంలో వ్యవసాయం చేశాడు. బాల వల్లభ్ భాయి తండ్రికి పొలం పనిలో సహాయం చేసేవాడు. ఝవేరీభాయి తన పిల్లలను పొలానికి తీసుకు వెళ్ళేవాడు. దారిలో వారికి నిజాయితీ, శ్రమ,శక్తి, ధైర్యం మొదలగు విలువల ప్రాముఖ్యాన్ని వివరించేవాడు. తల్లి లాద్‌బాయి పిల్లల్లో దైవభక్తి, ధర్మ నిర్ణయాల పట్ల ఆసక్తి కలిగించేది.


వల్లభ్ భాయి పటేల్ ప్రాథమిక విద్య కరమ్‌సాద్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. పాఠశాలలో పుస్తకాలకంటే ఆటలంటేనే బాగా ఇష్టపడేవాడు. కుస్తీపట్టడమంటే పటేల్‌కు చాలా ప్రీతి. బాల్యంలోనే పటేల్‌కు నాయకత్వ లక్షణాలు, నిర్వహణాచాతుర్యం, కార్యకుశలత అలవడ్డాయి. తండ్రి దగ్గర నేర్చుకొన్న గుణాలైన నిర్భీతి, సచ్ఛీలత పటేల్ జీవితమంతా వెన్నంటి ఉన్నాయి.

1893లో పటేల్‌కు జవేరీబాయితో వివాహమైంది. జవేరీబాయి శాంత స్వభావురాలు. ఆమెకు పటేల్ అంటే భక్తి, ప్రేమ ఉండేవి. 1897లో పటేల్ మెట్రిక్ పాసయ్యాడు. ఆ తర్వాత ప్లీడర్ పరీక్షలో కూడా ఉత్తీర్ణుడయ్యాడు. గోద్రా, బోర్సాద్‌లలో న్యాయవాదిగా పనిచేశాడు. ఆ తర్వాత ఇంగ్లాండు వెళ్ళి బారిష్టరు కోర్సు చదివాడు.



1917వ సంవత్సరంలో పటేల్‌కు గాంధీజీతో పరిచయమైంది. అప్పటినుంచి పటేల్ జీవితం మారిపోయింది. ఆయన తన జీవితాన్ని పూర్తిగా ప్రజాసేవకు అంకితం చేశాడు. అదే సంవత్సరం జరిగిన గుజరాత్ సభలో గాంధీ, పటేల్ ఇద్దరు కలిసి పనిచేశారు. వారిద్దరి మధ్య గురుశిష్య సంబంధం వర్ధిల్లినది.

1928లో బ్రిటీషు ప్రభుత్వం భూమిశిస్తు పెంచింది. బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పటేల్ నాయకత్వంలో లక్షలాది రైతులు పోరాటం చేసారు. ప్రభుత్వం దిగివచ్చి పన్నులను తగ్గించింది.



ఈ విజయానికి సంతోషించిన గాంధీజీ పటేల్‌ను "సర్దార్" అని పిలిచాడు. నాటినుండి సర్దార్ వల్లభ్ భాయి పటేల్‌గా కీర్తించబడుతున్నాడు.

స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నందుకు 1932లో గాంధీ, పటేల్‌లను బ్రిటీషు ప్రభుత్వం ఎరవాడ జైలులో ఉంచింది. 16 నెలల పాటు వీరిద్దరు చెరసాలలో ఉన్నారు. ఆ సమయంలో గాంధీజీకి పటేల్ సేవ చేశారు. 1942లో కూడా సర్దార్ పటేల్‌ను బ్రిటీషు వారు రెండుసార్లు జైలులో ఉంచారు. అనారోగ్యంతో ఉన్నందున ఆయనను విడుదల చేసింది ప్రభుత్వం. మళ్ళీ మూడేళ్ళపాటు పటేల్‌ను చెరసాలలో నిర్బంధించింది. దేశభక్తులందరి పోరాటాల ఫలితంగా భారతదేశానికి 1947 ఆగష్టు 15 న స్వాతంత్ర్యం వచ్చింది.

స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి ఉప ప్రధానమంత్రిగా, హోంశాఖామంత్రిగా పదవిని చేపట్టారు పటేల్. తన శక్తియుక్తులనంతా ఉపయోగించి 565 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనంచేశారు సర్దార్ పటేల్. ప్రజలకు ఉపయోగపడే ఐ.ఏ.ఎస్., ఐ.ఆర్.ఎస్., ఐ.ఎఫ్.ఎస్., ఐ.పి.ఎస్. వంటి కేంద్ర సర్వీసులను ప్రారంభించారు.

నిరంతరం దేశ సేవలో నిమగ్నమై ఉండటంవల్ల శరీరం అలసిపోయింది. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణించడంతో సర్దార్ వల్లభ్ భాయి పటేల్ 1950 డిసెంబర్ 15వ తేదీన కన్నుమూశారు. 1991 జూన్ 17న భారత ప్రభుత్వంచేత పటేల్‌కు మరణానంతరం "భారతరత్న" పతక ప్రదానం జరిగింది.

## అభ్యాసం

### I. అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| సమరం | = | యుద్ధం | సుస్థిర | = | శాశ్వతమైన |
| యోధుడు | = | వీరుడు | జన్మించు | = | పుట్టు |
| ధీరుడు | = | ధైర్యవంతుడు | స్వగ్రామం | = | పుట్టిన ఊరు |
| సంగ్రామం | = | యుద్ధం | ఆసక్తి | = | ఇష్టం |
| విశిష్ట | = | గొప్ప | నిర్భీతి | = | భయం లేకుండా |

| | | | | | |
|---|---|---|---|---|---|
| సచ్ఛీలత | = | మంచి నడవడి | ఉద్యమం | = | పోరాటం |
| ప్రీతి | = | ఇష్టం | చెరసాల | = | జైలు |
| మెట్రిక్ | = | 10వ తరగతితో సమానమైన చదువు | నిర్బంధించు | = | కదలకుండా చేయు |
| బారిష్టరు | = | న్యాయవాది | నిరంతరం | = | ఎల్లప్పుడు |
| వర్ధిల్లుట | = | అభివృద్ధి చెందుట | కన్నుమూయు | = | మరణించు |

## II. పదజాలం

**(అ) క్రింది వాక్యాలలోని గీత గీసిన మాటలకు అదే అర్థాన్నిచ్చే మాటలను గుర్తించండి.**

1. మూడో ప్రపంచ యుద్ధం వస్తే భూమిపై ఒక్క మనిషీ మిగలడు. ( )
   ఎ) సంగ్రామం, స్వరాజ్యం బి) సంగ్రామం, సమరం సి) సమరం, వారం
2. మా నాన్నకు చదరంగమాడటమంటే ఎంతో ప్రీతి. ( )
   ఎ) ఇష్టం, ఆసక్తి బి) ఆసక్తి, శక్తి సి) ఇష్టం, వెలుగు
3. దొంగలను జైలులో బంధించారు. ( )
   ఎ) చెరసాల, ఖైదు బి) చెరసాల, పాకశాల సి) ఖైదు, వాదు
4. రాంబాబు నిరంతరం పుస్తకాలు చదువుతుంటాడు. ( )
   ఎ) ఎల్లప్పుడు, ఒకసారి బి) ఎల్లవేళలా, అశాశ్వతం సి) ఎల్లప్పుడు, నిత్యం
5. ప్రముఖ సాహితీవేత్త కృష్ణమూర్తి గారు నిన్న కన్నుమూశారు. ( )
   ఎ) మరణించు, జన్మించు బి) మరణించు, చనిపోవు సి) చనిపోవు, వర్ధిల్లు

**(ఆ) ఈ క్రింది మాటలను సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.**

1. ప్రతినిధి : ______________________
2. సాహసవంతుడు : ______________________
3. ప్రీతి : ______________________
4. కీర్తించబడు : ______________________
5. శక్తియుక్తులు : ______________________

**(ఇ) ఈ క్రింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.**

1. సుస్థిర × ____________
2. ధైర్యం × ____________
3. ____________ × నిర్భీతి
4. ____________ × అశాంతి
5. వ్యతిరేకం × ____________
6. ____________ × బానిసత్వం
7 నిర్బంధం × ____________
8. విలీనం × ____________

**(ఈ) ఈ క్రింది మాటలకు వచనాలు రాయండి.**

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| సైనికుడు | ____________ |
| విలువ | ____________ |
| ____________ | గుణాలు |
| రైతు | ____________ |
| ____________ | పోరాటాలు |
| సేవ | ____________ |

**(ఉ) పాఠంలోని సంయుక్తాక్షర పదాలు రాయండి.**

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు రెండు లేక మూడు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పటేల్ ఎక్కడ జన్మించారు ? తల్లిదండ్రులెవరు ?
2. ఝువేరీ భాయి పిల్లలకు ఏం నేర్పించాడు ?
3. గాంధీ, పటేల్ మధ్య సంబంధం ఎలా ఏర్పడింది ?
4. పటేల్ "సర్దార్ పటేల్" గా మారిన సంఘటనను వివరించండి.
5. స్వతంత్ర భారతదేశ హోంశాఖామంత్రిగా పటేల్ చేపట్టిన చర్యలేవి ?
6. సర్దార్ పటేల్‌ను ఉక్కుమనిషిగా పిలవడానికి గల కారణం ఏమిటో వివరించండి.

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. "గాంధీ – పటేల్‌ల మధ్య ఉన్న సంబంధం భారతదేశం స్వాతంత్ర్యం పొందడానికి కారణమైంది" అన్న మాటలను సమర్థిస్తూ మీ అభిప్రాయాలను రాయండి.
2. సర్దార్ వల్లభ్ భాయి పటేల్ జీవితం నుండి మీరేం తెలుసుకొన్నారో సొంత మాటల్లో రాయండి.

## IV. వ్యాకరణం

**ఈ క్రింది వాక్యాలను గమనించండి.**

1. రమేష్ పుస్తకం చదివాడు.
2. రమేష్ పుస్తకం చదువుతున్నాడు.
3. రమేష్ పుస్తకం చదువుతాడు.

పై వాక్యాల్లో "చదివాడు" అను క్రియ జరిగిపోయిన కాలాన్ని సూచిస్తున్నది. ఇది "**భూతకాలం**".

"చదువుతున్నాడు "అను క్రియ జరుగుతున్న కాలాన్ని సూచిస్తున్నది. ఇది "**వర్తమాన కాలం**".

"చదువుతాడు" అను క్రియ జరగబోయే కాలాన్ని సూచిస్తున్నది. ఇది "**భవిష్యత్ కాలం**" .

**(అ) ఈ క్రింది క్రియలను భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల్లో తెలుపుతూ వాక్యాలు రాయండి.**

1. ఆడు    2. తిను    3. చూచు    4. పాడు

## V. ప్రాజెక్టు పని



స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని దేశసేవ చేసిన ఒక జాతీయనాయకుడు / నాయకురాలు గురించిన వివరాలు సేకరించి, తరగతి గదిలో ప్రదర్శించండి.